క్లుప్తంగా

బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్‌గా చిరంజీవి



చిరంజీవికి నియామకపత్రం అందజేస్తున్న సురేశ్

మిర్యాలగూడ టౌన్ : బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన లింగంపల్లి చిరంజీవిని నియమిస్తూ ఆ సమితి ఫౌండేషన్ అధ్యక్షులు దాసు సురేష్ ఆదివారం ఉత్తర్వులను జారీ చేశారు. అనంతరం నియామక పత్రాన్ని చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడుతానన్నారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఉద్యమ కార్యచరణను చేపట్టి బీసీల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన సురేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా క్రీస్తు దేవాలయ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

హాలియా : మండలంలోని ముక్కాముల గ్రామంలో సీఎస్ఐ క్రీస్తూ దేవాలయం 20వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా కిస్మిస్ వేడులను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2004 వ సంవత్సరంలో బిషప్ రెవ. రాజరత్నం ప్రతిష్ఠించినట్లు నిర్వాహకులు తెలిపారు. అప్పటి నుంచి ఆధ్యాత్మిక బోధనలతో పాటు పేద విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు రెవ. విన్సెంట్, ప్రాంక్లిన్, మాద్గుల విజయ కుమారి, సుందర్ దేవదానం, వల్కి వినోద్, రోయ్య నగేష్, వీరుడు వెంకన్న, శ్రీను, మాద్గుల శేఖర్, శ్రీను, డాక్టర్ సన్ని తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ డివిజన్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన క్యాలెండర్‌ను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు చింతల చెరువు లింగయ్య, ఎర్రయ్య, గుండెబోయిన నాగేశ్వర్‌రావు, కేపీ రాజు, జ్వాల వెంకటేశ్వర్లు, అంజి, ఉరిబండి శ్రీనివాస్ యాదవ్, సైదులు, జాన య్య, శ్రీకాంత్‌చ అచ్చయ్య, మురళియాదవ్, చందుయాదవ్, నాగరాజు, సురేష్, ప్రవీణ్ యాదవ్, దారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పమాలధారులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని అశోక్‌నగర్ అయ్యప్ప దేవాలయంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో, పారిశ్రామికవేత్తలు గుడిపాటి నవీన్, బండారు కుశలయ్య సహకారంతో అయ్యప్పమాలధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అయ్యప్ప స్వామికి పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్, కౌన్సిలర్ శేఖర్‌రెడ్డి, నవీన్, ఇన్‌చార్జీలు జానకిరాంరెడ్డి, శ్రీనివాస్, శరత్, రమేష్, జగదీష్, పాల్గొన్నారు.

లస్కర్, పంప్ ఆపరేటర్లను రెగ్యులరైజ్ చేయాలి

హుజూర్‌నగర్ : నీటిపారుదల శాఖలో ఏళ్లుగా పనిచేస్తున్న లస్కర్, వాచ్‌మెన్, పంప్ ఆపరేటర్లను రెగ్యులరైజ్ చేయాలని లిఫ్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా సెక్రటరీ ప్రసాద్ కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం సభ్యులు కె.శ్రీను, వి.రాము, మహేష్, వెంకట్, అప్పారావు, పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మోక్షం

- త్రిపురారంలో రెండు రోడ్లకు రూ. 9 కోట్లు
- నిడమనూరులో రూ. 2.5 కోట్లు మంజూరు
- మిగతా రహదారులకు నిధులు మంజూరు చేయాలని వేడుకోలు

త్రిపురారం : మండలంలోని పలు గ్రామీణ రహదారులకు మోక్షం కలిగింది. రోడ్ల నిర్మాణానికి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అయా గ్రామ పంచాయతీల పరిధిలో గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి జానారెడ్డి తండాలను కలుపుతూ డాంబర్ రోడ్లను వేయించారు. మళ్లీ అప్పటినుంచి ఆ రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో గ్రామీణ రోడ్లు గుంతలమయంగా మారాయి. ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వర్షాలు వచ్చినప్పుడు రోడ్లపై పడిన గుంతల్లో వర్షపు నీరు నిలబడి ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. సాగర్ ఎమ్మెల్యేగా కుందూరు జయవీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కూడా రఘువీర్‌రెడ్డి ఉండడంతో పాటు ఆర్‌అండ్‌బీ మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉండటంతో గ్రామీణ రోడ్లకు మోక్షం లభించింది.

రూ.11.5కోట్ల నిధులు మంజూరు

త్రిపురారం మండల కేంద్రంలో ప్రధాన సెంటర్ నుంచి అంజనపల్లి వరకు రూ. 5 కోట్లు, ముకుందాపురం నుంచి దుగ్గెపల్లి మీదుగా కన్నెకల్ వరకు రూ. 4 కోట్లు, నిడమనూరు మండలంలో పార్వతీ నుంచి రాజన్నగూడెం వరకు రూ. 2.5 కోట్లు మంజూరయ్యాయి. దీంతో మండల ప్రజలు ఆనందం



అధ్వానంగా త్రిపురారం - అంజపల్లికి రహదారి

వ్యక్తం చేస్తున్నారు. మిగిలి ఉన్న రోడ్లు కూడా పూర్తి చేయాలని కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని రహదారులు

- దుగ్గెపల్లి నుంచి జీఅన్నారం వరకు ఇప్పటి వరకు ఆయా గ్రామాల వాహనదారులు మట్టి రోడ్డు పైనే వెళ్లాల్సి వస్తుంది. కామరెడ్డి గూడెం నుంచి కంపాల పల్లి మీదుగా మునగభావి గూడెం వరకు ఉన్న రహదారి గుంతలమయంగా మారింది. అలాగే ముకుందాపురం నుంచి కంపాసాగర్ వరకు రోడ్డు అధ్వానంగా తయారైంది. త్రిపురారం నుంచి బెజ్జికల్, మత్రిగూడెం, పలుగు మీదుగా చెన్నాయిపాలెం ఎక్స్ రోడ్డు వరకు మరమ్మతులకు గుర్తైంది. చెన్నాయిపాలెం నుంచి అల్వాల పాడు, సత్యం పాడు తండా మీదుగా వస్త్రం తండా వరకు గుంతలుగా మారింది.
- రాగడప బ్రిడ్జి నుంచి రూప్ల తండా, అప్పలమ్మ గూడెం, లోక్యా తండా, మంగళి తండాలను కలుపుతూ బోర్రాయి పాలెం వరకు రోడ్లు నిర్మించాల్సి ఉంది. రాగడప బ్రిడ్జి నుంచి డొంక తండా మీదుగా బడాయి గడ్డ గ్రామ పంచాయతీ వరకు రహదారి అధ్వానంగా తయారైంది.
- రాగడప గ్రామ ప్రధాన సెంటర్ నుంచి పలుగు తండా, కాపువారి గూడెం, లచ్య తండా, కుంకుడు చెట్టు తండా గ్రామాలకు లింక్ రోడ్లు నిర్మించాల్సి ఉంది.

జానారెడ్డి వేసిన రోడ్లే ఉన్నాయి



మండలంలోని గ్రామాలకు జానారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు వేసిన రోడ్లు ఇప్పటికీ ఉన్నాయి. 10 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలో ఒక్క రోడ్డు కూడా వేయలేదు. తిరిగి జానారెడ్డి తనయుడు కుందూరు జయవీర్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తరువాత మళ్లీ నూతన రోడ్లు వేయిస్తున్నారు. మిగిలి ఉన్న రోడ్లను కూడా పూర్తి చేయాలని కోరుకుంటున్నాం.

– అంబటి సోమయ్య, పెద్దదేవులపల్లి

త్వరగా పనులు ప్రారంభించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుంది. మండలంలో చిన్న గ్రామ పంచాయతీలను ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10ఏళ్లుగా గ్రామీణ రోడ్లను పట్టించుకోకపోవడంతో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. వెంటనే రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేయాలి.

– సలికంటి బాలకృష్ణ, త్రిపురారం

రైతాంగ పోరాటాలను అణిచివేస్తున్న కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

వేములపల్లి (మాడుగులపల్లి) : రైతులు సాగిస్తున్న పోరాటాలను కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మాడుగులపల్లి మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో సీనియర్ నాయకుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు గతంలో ఢిల్లీలో సాగించిన పోరాటం ఫలితంగా కేంద్రం తలొగ్గి రైతులకు ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. తిరిగి రైతులు సాగిస్తున్న ఉద్యమాన్ని అణిచివేసేందుకు కుట్రలు చేస్తుందన్నారు. కేంద్రం ప్రభుత్వం వెంటనే రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని, ఉపాధిహామీ పథకానికి పని దినాలను పెంచాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలన్నారు. రైతు భరోసా, రైతులందరికి రూ.2లక్షలు వర్తింప చేయాలని, ఇండ్లు లేని పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డులను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శ్రీకర్, శ్రీ ను, నాగయ్య, విష్ణు, వెంకటాచారి, శ్రీను పాల్గొన్నారు.

రూ1.5కోట్లతో మైసమ్మతల్లి ఆలయ నిర్మాణం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లేపల్లి బంగారు మైసమ్మతల్లి దేవాలయ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని దేవాలయ చైర్మన్ ధీరావత్ దస్రునాయక్ అన్నారు. ఆదివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవాలయ నిర్మాణాన్ని రూ.1.5కోట్లతో అత్యంత ఆధునీక టెక్నాలజీతో నిర్మించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకుగాను ఎంతమంది భక్తులు వచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు సువిశాలంగా నిర్మిస్తున్నామని తెలిపారు. దేవాలయ నిర్మాణానికి నిధులు సరిపోకపోతే అవసరమైతే ప్రజాప్రతినిధులు, బంజారా ఉన్నతాధికారుల నుంచి నిధులు సేకరించి పూర్తి చేస్తామన్నారు. ఆలయం వద్ద పారిశుద్ధ్యన్ని మెరుగుపరిచేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, పూజారులు మాన్యనాయక్, వెంకటేశ్వర్లు, కిషన్, రమేష్ పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి

హాలియా : దేశానికి సర్దార్ వల్లభాయి పటేల్ చేసిన సేవలు మరువలేనివని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మందా సైదులురావు గౌతమ్ అన్నారు. ఆదివారం అనుముల మండలంలోని నాయుడుపాలెంలో సర్దార్ వల్లభాయిపటేల్ 74వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సర్దార్ వల్లభాయి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారతదేశంలో 550 సంస్థానాలను విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయిపటేల్‌కే దక్కిందన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు ఎన్నటికి మర్చిపోలేన్నారు. ఈ కార్యక్రమంలో వేమా సత్యనారాయణ, కందుల మల్లిఖార్జునరావు, మల్లెల ధర్మారావు, సంకు సత్యనారాయణ, కందుల రాంబాబు , కందుల విశ్వేశ్వరరావు, తిరుపతయ్య, అమ్మిశెట్టి నరసింహ రావు, శ్రీనివాస్, కందుల కల్యాణ్, ధనుంజయ్ తదితరులు ఉన్నారు.



నాయుడుపాలెంలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మహాగర్జనకు తరలివెళ్లిన నాయకులు



సభకు తరలివెళ్తున్న నాయకులు

దేవరకొండ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో ఆదివారం నిర్వహించిన మాలల మహాగర్జన సభకు దేవరకొండ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున మాల మహానాడు నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాల మహానాడు జిల్లా కో–ఆర్డీనేటర్ ఏకుల రాజారావు, నియోజకవర్గ అధ్యక్షుడు బోయిని చంద్రమౌళీ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు తీర్పునకు వ్యతిరేకంగా మాలలు ఒక్కతాటి పైకి రావాలని వారు పిలుపునిచ్చారు. తరలివెళ్లిన వారిలో నూనె సురేష్, చెన్నయ్య, వాసుదేవ్, బాలకృష్ణ, దామోదర్, వెంకటయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

నల్లగొండ టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక దీక్షలు ఆదివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. సమగ్ర శిక్షా ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని మౌనంగా నిరసన తెలిపారు. సంఘం నాయకులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసి అప్పటివరకు పే స్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మొలుగూరి కృష్ణ, బొమ్మగాని రాజు, క్రాంతికుమార్, కంచర్ల మహేందర్, డి.నీలాంబరి, కొండ చంద్రశేఖర్, గుమ్మల మంజులారెడ్డి, సావిత్రి, పుష్పలత, సాయిల్, వెంకట్, జి.వెంకటేశ్వర్లు,ఎర్రమల్ల నాగయ్యలు పాల్గొన్నారు. ఈ నిరసనకు అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

ఇద్దరు మెడికోలకు ఆర్థికసాయం అందజేత

నల్లగొండ: ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఇద్దరు మెడికల్ విద్యార్థులకు ఆదివారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ చేతుల మీదుగా ఆశాజ్యోతి ఫౌండేషన్ న్యూజెర్సీ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. సోమవారం కిశోర్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఆయన మిత్రులు ఆశాజ్యోతి ఫౌండేషన్ సభ్యులు దాట్ల చందన, ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యకు ఇబ్బందులు పడుతున్న కొండమల్లేపల్లికి చెందిన మెడికల్ విద్యార్థిని అందుగుల ప్రవళికకు రూ.1.30లక్షలు, కనగల్ మండలం చెట్ల చెన్నారం గ్రామ మెడికల్ విద్యార్థి తలకొప్పుల వంశీకి రూ.23 వేల విలువ గల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కౌన్సిలర్ మాడుగుల గణేష్, పడాల సతీష్ పాల్గొన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

నేరేడుచర్ల : ఢిల్లీలో రైతులు శాంతియుతంగా నిరసన చేస్తుంటే వారిపై కేంద్ర ప్రభుత్వం బయోగ్యాస్‌ను ఉపయోగించడాన్ని నిరసిస్తూ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంబటి భిక్షం, వాసా పల్లయ్య, సయ్యద్‌హుస్సెన్, వాస కరుణాకర్, లక్ష్మి, పావని ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి వేడుకలు



డిండి : షిర్డీ సాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దేవరకొండ : పట్టణంలోని శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో ఆదివారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం జలాభిషేకం, విష్ణు సహస్రనామం, దత్తాత్రేయ హోమం, భగవద్గీత పారాయణం వంటి విశేష పూజలు,కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయితత్వ ప్రచారకులు మైనంపాటి ప్రసాద్ దత్త వైభవం, సాయిలీలలపై ప్రవచనాలు అందించారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ దత్త జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలంపల్లి నర్సింహ, దొడ్డి అశోక్, వెంకటేశ్వర్లు, శ్రవణ్‌కుమార్, సుధాకర్, జనార్దన్, మల్లయ్య, జయపాల్‌రెడ్డి, భక్తులు, పాల్గొన్నారు.

డిండి : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం దత్తాత్రేయ జయంతి వేడుకలు భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన, మహాభిషేకం, గోమాత పూజ, తులసీ పూజ, సత్యనారాయణ స్వామి వ్రతం, నారాయణ సేవ, సామాజిక విష్ణు సహస్రనామ పారాయణం, పల్లకి సేవ, శేజ హారతి తదితర వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చెర్మన్ నరసింహ, రమేష్, పర్వత్‌రెడ్డి, మనోహర్, రఘుమారెడ్డి, మల్లయ్య, వేణుగోపాల్, శ్రీదేవి, లక్ష్మి, అన్నపూర్ణ, రాధిక, రాజలక్ష్మి, పురోహితులు ఆదిత్యపాండే, మృత్యుంజయ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ : ఎమ్మెల్యే బాలునాయక్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మున్సిపాలిటీ 1వ వార్డు పరిధిలోని వినాయక హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆదివారం ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. వేద మంత్రాలు, మంత్రోచ్ఛరణల మధ్య పసుపు, కుంకుమ, నవధాన్యాలను పోసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మద్ది కేశవరెడ్డి, నారబోయిన భిక్షం, మర్రు విజ్ఞయ్, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి, పిన్నపురెడ్డి సత్తిరెడ్డి, నేర్మటి సూర్యనారాయణ రెడ్డి, మెండు నర్సిరెడ్డి, దేవిరెడ్డి లక్ష్మారెడ్డి, బొడ్డుపల్లి యాదయ్య, కదిరే శ్రీశైలం, పాలకూరి వెంకటేశం, పల్నాటి శేఖర్ రెడ్డి, ఏమిరెడ్డి రవీందర్ రెడ్డి, దాసిరెడ్డి నవీన్ రెడ్డి, కోయగుర శ్రవణ్ రెడ్డి, సుంకిరెడ్డి నరసింహారెడ్డి, క్లెం సత్తిరెడ్డి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కాలనీవాసులు

ఎమ్మార్పీఎస్ పట్టణ కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్ : పట్టణంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు బచ్చలకూడి ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా చింతిర్యాల నాగయ్య, ప్రధాన కార్యదర్శిగా మంద నాగరాజు, కార్యదర్శిగా సోమపంగు రవీంద్ర, గౌరవ సలహాదారులుగా గల్లా వెంకటేశ్వర్లు, కస్తాల శ్రవణ్, మీసాల శరత్, మీసాల కిరణ్, మంద వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు సీహెచ్ బాలచంద్రుడు, ఎస్.వినోద్, ఎం.మట్టయ్య, ఎం.గోపి, ఎ.మహేష్, ఎం.లక్ష్మయ్య, ఏసు, కార్తీక్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.ఆదివారం దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి వద్ద గల డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి ట్రాన్స్‌పార్మర్, మంచినీటి సౌకర్యాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సొంత ఇళ్లు లేని పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వడ్త్య దేవేందర్, పున్న వెంకటేశ్, పల్లా నర్సింహారెడ్డి, యూనూస్, వెంకటేష్‌గౌడ్, కొండ్ర శ్రీశైలం యాదవ్, బిక్కునాయక్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

ప్రశాంతంగా గ్రూప్ -2 పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రాన్ని, తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్



శ్రీనివాస్‌నగర్ పరీక్షా కేంద్రం వద్ద గ్రూప్-2 అభ్యర్థులకు భోజనం అందజేస్తున్న పర్వేజ్

మిర్యాలగూడ : రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం ప్రారంభమైన గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ప్రారంభమయ్యాయి. మిర్యాలగూడ పట్టణం, మండలంలో 28 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా పేపర్-1 ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగగా పేపర్-2 పరీక్ష మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరిగింది. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి పరీక్ష హాలులోకి అభ్యర్థులను తనిఖీ చేసి పంపించారు. 28 కేంద్రాల్లో మొత్తం 7941 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా పేపర్-1 పరీక్షకు 3086 మంది హాజరు కాగా 4855 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అదే విధంగా పేపర్-2 పరీక్షకు 3062 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా 4897 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. మిర్యాలగూడలోని 28 కేంద్రాల్లో భారీ సంఖ్యలో అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షకు గైర్హాజరు కావడం గమనార్హం.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

మిర్యాలగూడ పట్టణం, మండలంలో గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, రీజినల్ కోఆర్డినేటర్ వెంకటరమణ, రూట్ ఆఫీసర్లు ఎంఈఓ బాలునాయక్, డి.ధర్మానాయక్, కొర్ర కృష్ణకాంత్‌నాయక్, శివకుమార్, జాయింట్ రూట్ ఆఫీసర్లు సీఐ నాగరాజు, ఎస్ఐలు శోభన్‌బాబు, వీరశేఖర్, సుధీర్, నరేష్, శేఖర్, రూరల్ ఎస్ఐ పి.లోకేష్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ నాగరాజు, పోలీస్ ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

గ్రూప్–2 అభ్యర్థులకు భోజనం ఏర్పాటు

మండలంలోని శ్రీనివాస్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన గ్రూప్-2 పరీక్షా కేంద్రానికి వచ్చిన అభ్యర్థులకు ఫాతిమా ఎన్విరాన్‌మెంట్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, జిల్లా తెలంగాణ ఆటో మోటార్స్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ పర్వేజ్ ఉచితంగా మధ్యాహ్న భోజనం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మొహమ్మద్ నాజర్‌అలీ మీర్జా మాట్లాడుతూ కష్టపడి చదివి దూర ప్రాంతాల నుంచి గ్రూప్-2 పరీక్షా కేంద్రానికి వచ్చిన అభ్యర్థులు ఆకలితో ఇబ్బందులు పడకుండా ఉండేందుకుగాను తమవంతుగా అభ్యర్థులకు ఉచితంగా భోజనం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, గోపాలకృష్ణ, వినోద్, జావిద్, జహంగీర్‌లాల్, హొసేన్ ఆరిఫ్, సర్వేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు హెల్ప్‌లైన్ సెంటర్

మిర్యాలగూడ : ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేసేందుకుగాను డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్‌లో ఆదివారం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్ మాట్లాడుతూ ఈ హెల్ప్‌లైన్ సెంటర్ వల్ల అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయడంతోపాటు మిర్యాలగూడ పరిధిలోని 28 పరీక్షా కేంద్రాల అడ్రస్‌లను అభ్యర్థులకు తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో గోవర్ధని, అరుణ, పతాని శ్రీను, వదూద్, పల్లా భిక్షం, రామలింగయ్య, జీలకర నాగరాజు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ టూటౌన్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండలోని అవుట్‌డోర్ స్టేడియంలో క్రీడా పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి మాట్లాడుతూ సోమవారం ఉదయం 10.30 గంటలకు క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని, క్రీడాకారులు గంట ముందుగా అవుట్ డోర్ స్టేడియం చేరుకోవాలని కోరారు. ప్రతి రోజు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 5వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర కార్యదర్శిగా లచ్చిరాం

నల్లగొండ: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లిలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఉదావత్ లచ్చిరాం తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర కార్యదర్శిగా ఆదివారం నియామకం అయ్యారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు జి.స్థిత ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్, తదితరులకు లచ్చిరాం ధన్యవాదాలు తెలిపారు. లచ్చిరాం 2022లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఆయన నియామకం పట్ల పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల కష్టాలు

- పెండింగ్‌లో దరఖాస్తులు
- పరిష్కారం కాని విద్యుత్ సమస్యలు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

మిర్యాలగూడ : విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. తమ పొలాలతోపాటు అపార్ట్‌మెంట్‌లు ఇతర గృహ అవసరాల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి వేచి చూసినా ట్రాన్స్‌ఫార్మర్లు అందడం లేదు. దీంతో విద్యుత్ సమస్యలు తీరక రైతులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని కార్యాలయాలు చుట్టు రైతులు రోజుల తరబడి తిరుగుతున్నారు పైసలు ఇస్తేనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చే పరిస్థితి ఉండడంతో, ఆ డబ్బులు ఇచ్చే పరిస్థితి లేక రైతులు రోజుల తరబడి వేడుకుంటున్నారు.

1500కు పైగా పెండింగ్ దరఖాస్తులు...

జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల దరఖాస్తులు సుమారు 1500కు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. అదనంగా డబ్బులు ఇవ్వకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయకపోవడం కారణంగా కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు మూలుగుతున్నాయి. గతంలో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.1000 అదనంగా ఇచ్చే ఆనవాయితీ ఉండగా ఇప్పుడు రూ.3వేల నుంచి రూ.4వేలు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా 9 నెలల నుంచి 8 స్విచ్‌లు ఇవ్వకపోవడంతో విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు నిలిచిపోయాయి. ఇందులో 35, 63, 100 కేవీల ట్రాన్స్‌ఫార్మర్లు అధికంగా ఉన్నాయి. సీపీఎస్(అపార్ట్‌మెంట్‌లు, పెద్ద భవనాలు) మీటర్ల కోసం సుమారు 500కు పైగా దరఖాస్తులు చేసుకున్నప్పటికీ వారికి మీటర్లు అందించడం లేదు.

